మిరప సాగు.. భలే బాగు

రైల్వేకోడూరు అర్బన్: సన్నకారు రైతులకు మిరప సాగు లాభదాయకంగా మారింది. రైల్వేకోడూరు మండలంలోని కేసీ.అగ్రహారం, శెట్టిగుంట, రెడ్డివారి పల్లి, రాఘవరాజపురం, బొజ్జావారిపల్లి గ్రామాలలో రైతులు తమకున్న కొంత భూమిలో మిరప సాగు చేస్తున్నారు. పలువురు అరటిలో అంతర్ పంటగా, ఎక్కువ శాతం రైతులు డ్రిప్ ద్వారా మిరప సాగు చేస్తున్నారు. ఈ ఏడాది దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. మరో రెండు నెలల్లో తెగుళ్లు, కలుపు రాకుండా జాగ్రత్తలు తీసుకొంటే 15 రోజులకు ఒకమారు కోతకు వస్తుంది. ఇపుడు పచ్చి మిరపకాయలను మార్కెట్‌లో కిలో రూ.45 ధర పలుకుతోంది. రైతులు నిత్యం అమ్ముకొని సొమ్ము చేసుకొంటున్నారు. చీడపీడల నుంచి పంటను కాపాడుకోగలిగితే 195 రోజుల వరకై ఫలితాన్ని రాబట్టవచ్చునని రైతులు చెబుతున్నారు.


విరగ కాసిన మిరప

రోజూ కొంత ఆదాయం



20 సెంట్ల జాగాలో పచ్చిమిరప సాగు చేశాను. నెల రోజులుగా ప్రతి రోజూ 30 కిలోల వరకూ కాపు వస్తోంది. మార్కెట్‌కు తరలించడంతో రోజూ రూ.700 వరకూ ఆదాయం లభిస్తోంది. –సిద్ధారెడ్డి, కేసీ అగ్రహారం, కోడూరు

ప్రకృతి మెరిసె...మాగాణి మురిసె



కనుచూపుమేర పచ్చని పొలాలు. వంపులు తిరిగిన గట్ల అందాలు...కొండలతో దోబూచులాడుతున్న తెల్లని మేఘాలు..మనసు ఆహ్లాదాన్ని పంచేలా ఉన్న ఈ రమణీయ దృశ్యం అన్నమయ్య జిల్లా నందలూరు–రాజంపేట మధ్య చెయ్యేరు నది పరీవాహక ప్రాంతంలోనిది. కడప–రేణిగుంట రహదారిపై ప్రయాణికులను ఈ దృశ్యం ఆకట్టుకుంటోంది. ఓ వైపు కొండలు.. మరోవైపు పంటలు కలిసి అరకు అందాల్ని తలపిస్తున్నాయి. ఈ దృశ్యాలను బుధవారం సాక్షి క్లిక్ మనిపించింది.

– రాజంపేట

క్లుప్తంగా

అన్నదానం పుణ్యకార్యం


అన్నదానం చేస్తున్న దాత కుటుంబీకులు

రాయచోటి జగదాంబసెంటర్: అన్నదానం మహా పుణ్యకార్యం అని లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ అధ్యక్షుడు పసుపులేటి శ్యామ్ అన్నారు. వెల్లలూరువాండ్లపల్లికు చెందిన పునర్విక పుట్టినరోజు సందర్భంగా ఆమె తల్లిదండ్రులు వెంకటమల్లేష్, శ్రావణి దంపతుల సాయంతో బండపల్లి ప్రేమాలయం వృద్ధాశ్రమంలో బుధవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ మహమ్మద్, కోశాధికారి మనోహర్‌రాజు, సిబ్బంది, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న స్వాతి

రాయచోటి జగదాంబసెంటర్: ప్రతి ఒక్కరూ హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలని పీసీఎస్ఎస్ ప్రాజెక్టు మేనేజర్ టి.స్వాతి పేర్కొన్నారు. పట్టణంలోని హరినాథరెడ్డి డిగ్రీ కళాశాల విద్యార్థులకు హెచ్ఐవీ, టీబీ, మాదక ద్రవ్యాల వాడకంతో కలిగే అనర్థాలపై బుధవారం అవగాహన కల్పించారు. స్వాతి మాట్లాడుతూ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడంతో ఎక్కువమంది హెచ్ఐవీ పరీక్షలు చేసుకునేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. ఎన్ఎసీఓ నేతృత్వంలో రెండు నెలల పాటు మీకు తెలుసా కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రెడ్డప్పరెడ్డి, అనిత, జి.అంజనమ్మ, లెక్చరర్లు జనార్దన్‌రెడ్డి, రామాంజనేయులు, మద్దిలేటినాయుడు, పీరయ్య, రెడ్డయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

రైల్వేకోడూరు అర్బన్: జిల్లాలోని బొప్పాయి పంటకు రూ.10 గిట్టుబాటు ధర కల్పించాలని జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు సీహెచ్.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దారు అమర్‌నాథ్‌ను బుధవారం ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారీల బారిన పడి రైతులు నష్టపోకుండా.. కలెక్టర్ ఆదేశాలను వెంటనే అమలు చేయాలని కోరారు. కనీస మద్దతు ధర రూ.9 అయినా అమలుచేయాలని కోరారు. ధరల విషయంలో రైతుల సమస్యలు తెలుసుకొని కలెక్టర్‌కు విన్నవిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పంటలపై అవగాహన

పెనగలూరు: వ్యవసాయ పంటలపై బుధవారం సాయంత్రం శాస్త్రవేత్తలు సతీష్ లింగారెడ్డి, రవిప్రకాష్‌రెడ్డి, శేషారెడ్డి, హర్షవర్దన్‌గుప్తా(క్రాప్ నోసిస్ ప్రైవేటు లిమిటెడ్) బుధవారం అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ వరి, మామిడి, నిమ్మతోటలు ఈ ప్రాంతంలో అధికంగా ఉన్నాయన్నారు.

పురపాలికలో టోల్ ఫ్రీ నెంబర్

రాజంపేట: రాజంపేట పట్టణ వాసులకు మెరుగైన సేవలందించేందుకు పురపాలిక కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబరు(08565 240336) అందుబాటులోకి తీసుకువచ్చామని పురపాలక కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ పట్టణంలో వీధిదీపాలు పనిచేయక పోవడం, చెత్త సేకరణలో అంతరాయం, డ్రైనేజీ సమస్యలతో ఇబ్బందులు ఎదురైతే వెంటనే పురపాలిక కార్యాలయానికి తెలియజేయాలన్నారు. ఫిర్యాదు వెంటనే నమోదు చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. సంబంధిత విభాగాల అధికారులు ప్రజలు ఇచ్చిన ఫిర్యాదుపై తక్షణం స్పందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

నిర్మాణాలు పూర్తిచేయాలి

గాలివీడు: అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను లబ్ధిదారులు వెంటనే పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్ సూచించారు. హౌసింగ్ ఏఈ రమేష్ నాయక్‌తో కలిసి ఆయన వెలిగల్లు లేఅవుట్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఎల్ఆర్ఎల్, ఆర్ఎల్, ఆర్సీ స్టేజ్‌లో ఉన్న వాటిని పూర్తిచేయాలని సూచించారు. ఇళ్లకు అదనంగా బిల్లులు చెల్లించడం జరిగిందన్నారు.

దత్తత తీసుకోవాలి

లక్కిరెడ్డిపల్లి: చదువులో వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకోవాలని అసిస్టెంట్ అకాడమీ మానిటరింగ్ ఆఫీసర్ పీవీఎన్ కుమార్ అన్నారు. లక్కిరెడ్డిపల్లి ఏపీ మోడల్ స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పది, ఇంటర్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. హాస్టల్ వసతి గృహాన్ని పరిశీలించి వార్డెన్లకు సలహాలు ఇచ్చారు.

చెట్టు తొలగించారు

రాజంపేట టౌన్: పట్టణంలోని మార్కెట్ వద్ద ఓ భారీ వృక్షం నేలకొరిగేలా ఉండేది. ఈ నేపథ్యంలో దృష్టిసారించండి.. ప్రమాదం తప్పించండి శీర్షికతో ఈ నెల 15న సాక్షి దిన పత్రికలో వెలువడిన కథనానికి మున్సిపల్‌శాఖ అధికారులు స్పందించారు. ప్రమాదకరంగా ఉన్న వృక్షాన్ని తొలగించారు. వ్యాపారులు, వాహనదారులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రైవేటు బ్యాంకుల్లో జీతాలు జమ చేయవద్దు



పురపాలక కార్యాలయం ఎదుట కార్మికుల నిరసన

రాజంపేట: రాష్ట్ర ప్రభుత్వం తమ జీతాలను ప్రైవేటు బ్యాంకులలో జమచేయవద్దంటూ మున్సిపాలిటీ కార్మికులు రాజంపేట పురపాలక సంఘం ఎదుట బుధవారం నిరసన వ్యక్తం చేశారు. పురపాలిక కార్మికుల అకౌంట్స్‌ను యాక్సిస్ బ్యాంక్‌లో ఓపెన్ చేయాలని కమిషనర్ల నుంచి కార్మికులపై ఒత్తిడి తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ కార్మికులు బుధవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ.రమణ మాట్లాడుతూ ప్రైవేటు బ్యాంకుల నుంచి జీతాలను డ్రా చేసే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులను పాస్ చేసిందన్నారు. ఇప్పుడు బ్యాంకు మారిస్తే పీఎఫ్ డబ్బులు ఏ విధంగా జమవుతాయని ప్రశ్నించారు. ఇదేదో మోసపూరిత మాటలుగా కనిపిస్తోందని, కూటమి ప్రభుత్వం కార్మికులకు అన్యాయం చేసే విధంగా పాలనా విధానాలను తీసుకొస్తోందన్నారు. రాజంపేటలో 25 మంది బదిలీ వర్కర్స్ పనిచేస్తున్నారని, మూడు నెలల నుంచి వారికి జీతాలు ఇవ్వడంలేదన్నారు. తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్, నేతలు ఎం.రమణ, పండు రవిశంకర్, ఓబయ్య పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సు కోసమే మానవతా సేవలు


ర్యాలీ నిర్వహిస్తున్న మానవత సంస్థ సభ్యులు

సుండుపల్లి: సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ మానవతా విలువలు కలిగి ఉండాలని, పేదలకు సేవలు అందించాలని ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు, ఎంఈఓ రవీంద్రనాయక్ అన్నారు. సుండుపల్లె మానవతా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం శాంతి ర్యాలీ నిర్వహించి, నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి రథం, అంబులెన్స్, బాడీ ఫ్రీజర్ బాక్సులతోపాటు విద్యార్థులలో నైతిక విలువలు పెంపొందించడం, విద్యలో రాణించేలా ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలు చేస్తూ అందరి మన్ననలను పొందుతున్న సంస్థ మానవత అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హరికుమార్, నాగేశ్వర, రవీంద్రనాథరెడ్డి, లక్షుమయ్య నాయుడు, అమృతనాయక్, మహబూబ్‌బాషా, రామకృష్ణారెడ్డి, నాగబసిరెడ్డి, నూరుల్లా, సుధాకర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈఓకు ఉపాధ్యాయుల సత్కారం


డిప్యూటీ డీఈఓను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

నందలూరు: మండల విద్యాశాఖ అధికారిగా ఉంటూ ఇటీవల రాయచోటి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు స్వీకరించిన లంకాయగారి నాగయ్యను ఉపాధ్యాయులు బుధవారం శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. స్థానిక నాగిరెడ్డిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యాశాఖకు గొప్ప పేరు వచ్చేలా చేసి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 అనంతకృష్ణ, గ్లోరీ కిరణ్ ఉజాల, నాగిశెట్టి లక్ష్మీనారాయణ, బోగా వెంకటసుబ్బయ్య, శిల్పి ఆనందాచారి, గీత, జ్యోతిప్రియ, ఆర్వి రమణమ్మ, పి.వి జయకుమారి, గౌరీ, మస్తాన్, గాయత్రీదేవి, డాక్టర్ శర్వాణి, షాకీర్ హుస్సేన్, పెంచలయ్య, సీఆర్పీ అరుణజ్యోతి, నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వంతెన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి


వంతెన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పీఎంజీఎస్‌వై నిధులు రూ.5 కోట్లతో తాము మంజూరు చేయించిన కోడూరు గుర్రప్పపాళెం వంతెన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు కోరారు. వంతెన వద్ద జరుగుతున్న పనులను బుధవారం ఆయన పరిశీలించి గుత్తేదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని వంతెన నిర్మాణాన్ని నాణ్యతగా నిర్మించాలన్నారు. గత ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. కూటమి పాలకుల నిర్లక్ష్యంతో అవి పూర్తి కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రవాసాంధ్ర అసోసియేషన్ సేవలు అమోఘం


ఆర్థిక సహాయం అందజేస్తున్న ధ్వజారెడ్డి

రైల్వేకోడూరు అర్బన్: పేదలను ఆదుకోవడంలో కువైట్ రెడ్డీస్ అసోషియేషన్ సేవలు అమోఘమని వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి అన్నారు. మండలంలోని రాఘవరాజపురానికి చెందిన అసోసియేషన్ సభ్యుడు దేశూరి శ్రీనివాసులురెడ్డి బుధవారం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను కువైట్ ప్రవాసాంధ్ర రెడ్డీస్ అసోసియేషన్ అధ్యక్షుడు నాయిని మహేశ్వర్‌రెడ్డి, యర్రంరెడ్డి రవీంద్రద్రారెడ్డితో కలిసి ఆయన పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ విదేశాలలో సంఘంగా ఏర్పడి కష్టాలలో ఉన్న వారికి అండగా నిలవడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, తోటశివసాయి, సిద్ధారెడ్డి, రౌఫ్, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పింఛన్ల తొలగింపు


ఎంపీడీవో రామచంద్రకు తమ కష్టాలు విన్నవిస్తున్న దివ్యాంగులు

సంబేపల్లి: కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు వికలత్వ శాతాన్ని తగ్గించి పింఛన్ తీసేస్తోంది. మండలంలో 595 మంది దివ్యాంగులు ఉండగా, 36 మందికి 40 శాతం కంటే తక్కువ వికలత్వం వుందని అనర్హులుగా ప్రకటిస్తూ నోటీసులు జారీచేసింది. మరింత మందికి 90శాతం కంటే తక్కువ వికలత్వం వుందని రూ.15 వేల పింఛను రూ.6వేలకు కుదించింది. వీరంతా బుధవారం ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చి అధికారులకు విన్నవించారు. అందరికీ న్యాయం చేస్తామని ఎంపీడీఓ రామచంద్ర వికలాంగులకు భరోసా ఇచ్చారు.

తొలగిస్తే సహించేది లేదు

చిట్వేలి: అర్హుల పింఛన్లు తొలగిస్తే సహించేది లేదని ఏపీ వికలాంగుల, పింఛన్ దారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జెఎస్.ఆంధ్రయ్య హెచ్చరించారు. చిట్వేలిలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ పింఛన్లు రద్దు చేస్తూ అర్హులైన వికలాంగులకు నోటీసులు ఇవ్వడం అన్యాయయమన్నారు. గతంలో మూడు వేల పింఛన్లు ఉంటే... సగం తగ్గించి పెంచిన 6 వేల పింఛన్లు అమలుచేయాలని ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వంపై అంతిమ పోరాటం చేసి న్యాయంగా రావాల్సిన హక్కులు సాధించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు, శంకర్‌రెడ్డి, సుబ్బరాయుడు, గోపాల్‌రాజు, నాగమణి, రత్నమ్మ, నరసమ్మ, లక్షుమమ్మ, వికలాంగులు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

సంబేపల్లె: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసే మండపాలకు అనుమతి తీసుకోవాలని ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమీవేశంలో బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామాలలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసేవారంతా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీస్, విద్యుత్ అధికారుల అనుమతి తీసుకోవాలని, సమస్య తలెత్తకుండా చూడాలని కోరారు.

గోశాలకు తరలిస్తాం

రాయచోటి టౌన్: రాయచోటి పట్టణ ప్రధాన రోడ్లలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే పశువులను గోశాలకు తరలిస్తామని రాయచోటి మున్సిపల్ కమిషనర్ జి.రవికుమార్ హెచ్చరించారు. రాయచోటి పట్టణంలోని ప్రధాన రోడ్లను బుధవారం ఆయన పరిశీలించారు. రోడ్ల వెంట విచ్చలవిడిగా పశువులు పడుకోవడం చూసి వాటి యజమానులను పిలిచి మాట్లాడారు. ఇకపై పశువులు రోడ్లపై కనిపిస్తే సమీపంలోని గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు. మీ ఇళ్లలో భద్రంగా పెచుకోవాలని సూచించారు. అందరికీ మూడు రోజుల గడువు ఇస్తున్నట్లు హెచ్చరించారు.

గీత కార్మికులకు బార్ కేటాయింపు

రాయచోటి టౌన్: గీత కార్మికులకు బార్‌ను కేటాయించినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ అధికారి జి. మధుసూదన్ తెలిపారు. విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ బి.కొత్తకోట గీత కార్మికులకు బార్‌కేటాయించామని, ఆసక్తిగల వారు ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా రూ.5 లక్షల ధరావతు చెల్లించి దరఖాస్తు చేయాలని సూచించారు. 30న కలెక్టర్ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో బార్ కేటాయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐ గురుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భౌతిక దాడి హేయం

రాయచోటి టౌన్: శ్రీరాములు అనే వ్యక్తిపై భౌతిక దాడికి పాల్పడడం హేయమైన చర్య అని రాయచోటి ప్రజా సంఘాల నాయకులు అన్నారు. బోస్ నగర్ విద్యావంతుల వేదిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ సుండుపల్లె మండలానికి చెందిన శ్రీరాములుపై సంబంధం లేని వ్యక్తులు వచ్చి కర్రలతో దాడి చేయడం దారుణమన్నారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులు, ఈశ్వర్, రామాంజనేయులు, పల్లం తాతయ్య, వల్లెపు శ్రీరాములు, జీవానందం, మారుతీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

వీరబల్లి: మండలంలోని ఓదివీడు కస్పాలోని పాఠశాల, కుమ్మరపల్లి, ఎర్రంరాజుగారిపల్లి పాఠశాలలను ఎంఈఓ కృష్ణయ్య బుధవారం పరిశీలించారు. వారు పరిశీలించారు. పాఠశాల సమస్యలపై ఆరా తీశారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

నీటిశుద్ధి కేంద్రం ఏర్పాటు

పెనగలూరు: పూర్వ విద్యార్థులు పుచ్చకాయల వెంకటరమణ, పుచ్చకాయల శివయ్య, గోపవరం సుబ్బనరసయ్య, కట్టా వెంకటేశ్వరరావు, పాలూరు సుధాకర్ నాయుడు తదితరుల సాయంతో చక్రంపేట జెడ్పీ పాఠశాలలో మినరల్ వాటర్ కేంద్రం ఏర్పాటు చేశారు. పాఠశాల కమిటీ చైర్ పర్సన్ సావిత్రమ్మ బుధవారం నీటి శుద్ధి కేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెంచలయ్య, కుమార్, చాగల వెంకటేశు, వేణు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

రాజంపేట రూరల్: ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు పొందవచ్చని ఏఓ జి.నాగలక్ష్మి అన్నారు. మండలంలోని హస్తవరం ఆదర్శ రైతు ఆకేపాటి ప్రసాద్‌రెడ్డి పొలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ ప్రసాద్‌రెడ్డి తన పొలంలో 120 రకాల పండ్లు, ఆకు, కూరగాయ తోటలను సెంద్రీయ పద్ధతిలో సాగు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మల్లిక పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సాయం

ఓబులవారిపల్లె: కుంభ మేళాకు వెళ్లి అనారోగ్యంతో మృతి చెందిన నూకపాపుగారి సుధాకర్‌రెడ్డి కుటుంబానికి రెడ్డి కమిటీ సభ్యులు బుధవారం లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. రెడ్డి అసోసియేషన్ అధ్యక్షుడు నాయనిమహేశ్వర్‌రెడ్డి, తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మృతుడు సుధాకర్‌రెడ్డి గల్ఫ్‌లో అందరితో సన్నిహితంగా మెలిగేవారన్నారు. అనంతరం చెక్కును మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. నుకపాపుగారి శివారెడ్డి, పివి.రామచంద్రారెడ్డి, ఎర్రంరెడ్డి రవిచంద్రారెడ్డి, సిద్దారెడ్డి, పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీ మరిచారు


సబ్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

రాజంపేట: ఆటో డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను మరచిపోయిందని సీపీఐ జిల్లా కార్యదర్శి మహేష్ ధ్వజమెత్తారు. ఆటో డ్రైవర్లు, కార్మికులతో కలిసి బుధవారం స్థానిక సబ్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ భావనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ఉద్యోగాలు లేక లక్షలాది యువత అల్లాడుతోందని, ఆటోలు, ట్యాక్సీలను ఫైనాన్స్‌లో తీసుకొని ఉపాధి పొందుతున్నారన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పీఎల్.నరసింహులు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, సీపీఐ ఏరియా కార్యదర్శి శివరామకృష్ణదేవర మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఆటో డ్రైవర్లకు రూ.15వేలు వాహనమిత్ర కింద ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. జరిమానాలు పెంచే జీవో 21, 31 రద్దు చేస్తామని, మోటారు రంగ కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటుచేస్తామని చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చాక అన్ని హామీలు గాలికి వదిలేశారన్నారు. ఆటో కార్మికుల చలానాలను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి సికిందర్, గాలిచంద్ర, నాగేంద్ర, మౌలా, రమణ, గుండాలు, బలరాం, రమణయ్యనాయుడు, నాయక్, కొండయ్య, చందు, శ్రీహరి, శ్రీనాయక్, మనోహర్, భాను, నరసింహులు, చంద్ర, సుబ్రమణ్యం, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై విద్యార్థినులకు అవగాహన


యాప్‌పై అవగాహన కల్పిస్తున్న శంకర మల్లయ్య

రాయచోటి టౌన్: విద్యార్థినులు శక్తి యాప్‌పై అవగాహన పెంచుకోవాలని మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ జి.శంకర మల్లయ్య అన్నారు. పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు బుధవారం శక్తి యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఆపదలో ఉన్నా శక్తి యాప్ ద్వారా మిమ్మల్ని మీరు రక్షించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రధానంగా మహిళలు, యువతులకు ఇది ఎంతగానో ఉపయోగపడతుందన్నారు. ఆపదలో ఉన్నప్పుడు 112కు, సైబర్ నేరాలు జరిగినప్పుడు 1930కు, బాల్య వివాహాల నిర్మూలనకు 181కు, చిన్న పిల్లల భద్రత కోసం 1098కు ఫోన్ చేయాలని చెప్పారు. డ్రగ్స్‌ను నిరోధించేదుకు 1972కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాగర్ రెడ్డి, సురేఖ, పీరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక రోగులకు ఇంటి వద్దే బియ్యం


మాట్లాడుతున్న తహసీల్దారు మహబూబ్‌చాంద్

సుండుపల్లె: 65 ఏళ్లకు పైబడిన వయోవృద్ధులు, దివ్యాంగులు, మంచానికే పరిమితమైన దీర్ఘకాలిక రోగులకు ప్రతి నెలా 16వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఇంటి వద్దే బియ్యం, చక్కెర పంపిణీ చేయాలని తహసీల్దారు మహబూబ్ చాంద్ డీలర్లకు సూచించారు. మండల తహసీల్దారు కార్యాలయంలో డీలర్లతో బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కొందరు డీలర్లు షాపు వద్దకు వచ్చిన కార్డుదారులతో అగౌరవంగా మాట్లాడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. చాలామంది డీలర్లు బ్లూ టూత్ కనెక్ట్ కావడం లేదని 1వతేదీ నుంచి పంపిణీ చేయాల్సిన సరకులను ముందే ఇస్తున్నారన్నారు. వారిపై 6ఏ కేసు నమోదు చేస్తామని తెలిపారు. అనంతరం సుండుపల్లె 9వ చౌక దుకాణాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీ రవికుమార్, అఫ్జల్, డీలర్లు పాల్గొన్నారు.

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అవగాహన


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

నందలూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన ఉండాలని డాక్టర్ శరత్ కమల్ అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా బుధవారం మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించి, స్థానిక కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు కల్పించారు. డాక్టర్ శరత్‌కమల్, సీహెచ్ఓ వెంకటనారాయణ మాట్లాడుతూ దోమలు కుట్టడంతో డెంగీ, చికెన్‌గన్యా వ్యాధులు వస్తాయని తెలిపారు. మురిగినీటిలో ఉండే క్యూలెక్స్ దోమలతో బోదకాలు, మెదడువాపు జ్వరాలు వస్తాయన్నారు. ఇంటిలో వాడుకొనే తొట్టిలో నీటిని వారానికోసారి శుభ్రంగా కడిగి నీళ్లు పట్టుకోవాలని తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటిబయట పాత టైర్స్, పాతకుండలు వాడని రోళ్లలో నీరు నిల్వకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్.దాస్, ప్రిన్సిపల్ శ్రీదేవి పాల్గొన్నారు.

సిద్దవటం (ఒంటిమిట్ట): సిద్దవటం నలంద పాఠశాలలో పి.కొత్తపల్లి వైద్యాధికారి జె.ప్రవీణ్ కుమార్, సిద్దవటం సబ్ యూనిట్ ఆఫీసర్ ఇండ్ల సుబ్బరాయుడు దోమల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనరసమ్మ, మౌలాలి, లోకేశ్వరి, వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని 11వ బెటాలియన్‌లోని జడ్పీహెచ్ఎస్‌లో జేవీవీ జిల్లా అధ్యక్షుడు సమీర్‌బాషా దోమలతో వచ్చే వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే దోమలను నివారించవచ్చని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జయరామయ్య అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా లక్కిరెడ్డిపల్లి జడ్పీ హైస్కూల్ నుంచి విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి దోమతెరలు వాడాలని ప్రజలకు సూచించాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవదానం, మణి, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

రైల్వే సమస్యలు పరిష్కరించాలంటూ వినతి


జీఎంకు విన్నవిస్తున్న తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి

ఓబులవారిపల్లె: రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రైల్వే సమస్యలు పరిష్కరించాలని డీఆర్‌యూసీసీ మెంబర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి కోరారు. కడప రైల్వే స్టేషన్ పరిశీలనకు వచ్చిన సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవను బుధవారం ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. భరత్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఓబులవారిపల్లి రైల్వే స్టేషన్‌లో హరిప్రియ, రాయలసీమ, తిరుమల ఎక్స్‌ప్రెస్‌లకు, రాజంపేట, పుల్లంపేట స్టేషన్లలో నంద్యాల డెమో రైలుకు స్టాపింగ్ కల్పించాలన్నారు. రామయ్యపాలెం ఎల్–87 గేటు వద్ద నిలబడిన నీరు తొలగించి రెడ్డిపల్లి రైల్వే స్టేషన్‌కు పూర్వ వైభవం కల్పించాలని కోరారు. జీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

తహసీల్దారు కార్యాలయం తనిఖీ


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ భావన

వీరబల్లి: వీరబల్లి తహశీల్దారు కార్యాలయాన్ని రాజంపేట సబ్ కలెక్టర్ భావన బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. కార్యాలయ స్థితిగతులపై తహశీల్దారును అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెవెన్యూ సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.